**కుక్కల ఏడ్పుతో భీక్యా నిద్రలేచేడు. దూరంగా నక్కల వూళలు, ఇంటిముందు కుక్కల ఏడ్పు, చిరాకు పుట్టిస్తున్నాయి. అప్పటికే వాడు నాలుగైదు గంటలు నిద్రపోయేడు.**

కండ్లు నలుపుకుంటూనే "ఛీ...నీ తల్లి..." కుక్కలపై రాళ్ళు విసిరేడు. వాటిని తరిమి ఆకాశంవైపు చూచేడు. చుక్క నడినెత్తి కొచ్చింది.

ఊరబెట్టిన బెల్లం ఖుస ఆగిందో, లేదో వూదుడు గొట్టం బెట్టి విన్నాడు. 'తెల్లవారకముందే పని పూర్తి చేయాలి' ఆరిపోయిన లాంతరు వెలిగించి భార్య పక్కలోకి చూచేడు. "ఈ కుక్కల తల్లి ముండమొయ్య" ఎక్కడా చోటులేనట్టు భార్య-పిల్ల మధ్యలో పడు కుంటయి.

# ఋతువు

## మంజుబాబు

ఎంత మంట పెట్టినా పని పూర్తి కావటానికి కనీసం ఆరేడు గంటలు పడుతుంది అంత రాత్రి లేచు. మెలకువ రానందుకు నిద్రను తిట్టుకున్నాడు. ఎముకలు కొరికే చలిలో వణుకుతూనే "నెగడి"ని రాజేశాడు. మతంలో చేరినందుకు సామి (పాదరి) ఇచ్చిన కోటు తొడుక్కున్నాడు. "తెల్లదొర కోటు యియ్యకపోతే సచ్చేటోడినే" చర్చివైపు తిరిగి దండం పెట్టేడు. వాడి కంటూ మిగిలింది చింకి చాప. ఆ నల్ల కోటు మాత్రమే.

మండుతున్న "నెగడి" నుంచి నిప్పులు తీసి పొయ్యి ముట్టించాడు. రాజుకున్న పొయ్యి మీద భట్టీ వుంచాడు.

వారం రోజుల క్రితం 'భట్టీ'లో నాలుగు బకెట్ల నీరు. అర్ధమణుగు బెల్లం. పిడికెడు నవాసారం. గుప్పెడు తెల్ల తుమ్మ చెక్క. చారెడు రేల బెరడు. నాలుగు అరటి పండ్లు. దోసెడు లెప్ప పూవు వేసి నానబెట్టేడు. వూరిన సామాగ్రిబుస నిన్న పొద్దు ఏటవాలేప్పుడే తగ్గింది.

చిటికెడు గంజాయిని తీసి నలిపి సిగరెట్టులో కూర్చి ముట్టించేడు. రెండు దమ్ములకే చలి వదిలింది. భట్టీకి వేసిన బెరడు తీసి బాగా కలిపి బెరడు బిగించి. ఆవిరి గొట్టం తగిలించి గొట్టాన్ని చన్నీళ్ళ కుండలో నుంచి తీసి జాడిలోనికి వదిలాడు.

పొయ్యిలో మంటను ఎగదోశాడు. నెగడికి చలి కాపుకుంటూ కూర్చున్నాడు.

ఇదే భీక్యా జీవనోపాధి. ఎప్పుడు పొట్ట గడవకుంటే అప్పుడు వాడుసారాయికాస్తాడు సారా వాడికి పాడిపంట. వృత్తి. రెండు కుండలు. బెరడు. ఆవిరి గొట్టం జాడి వాడికి ఆస్తి.

నెగడి వేడి-గంజాయి మగతతో వాడి కండ్లు మూతలు పడుతున్నప్పుడు కుక్కలు ఒక్క పెట్టున మొరిగేయి. తుళ్ళిపడ్డాడు. కుక్కలు మొరిగే తీరునిబట్టి తండాలోకి ఎవరో కొత్త మనిషి వచ్చినట్టుతెలుస్తుంది. పోలీసులు కావచ్చు. అబ్కారి ముస్తాజరు గుమస్తాలు కావచ్చు.

ఎందో పేరేసి వుంటాడు. ఈమధ్య సేటుతో తను చాలా ఖరాఖండిగా వుంటున్నాడు. ఈసారి బెల్లం కూడా వాడి దగ్గర తేలేదు. వాడికి తన మీద కసిగానే వుంది. చేసేది చేస్తూనే చెప్పేది చెప్తూనే వుంటాడు. "ఛూ....పీడియమ్మ....కుక్కలకున్నపాటి యిస్వాసం లేకపాయె."

కుక్కలు మొరుగుతూ సందులోకి తిరిగాయి. తన గుడిసె ఒక్కటే వుందా సందులో. సేటు దగ్గర కాసిన సారా ఏపాడున్నా ఎవరూ పట్టించుకోరు. తనలాంటోడు పొట్టగడవక కాస్తే మాత్రం పట్టుకుంటారు. సారాయి వండుతుండగా పట్టుబడితే శిక్షపడుతుందని వాడికి తెలుసు. తెలిసి కూడా నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుండిపోయాడు. నిజానికి వాడికిప్పుడు జైలుకెళ్ళాలని వుంది. లచ్చివైపు తిరిగి చూచాడు. శరీరం మీద చీర సగం తొలిగి పోయింది. గురకమాత్రం గట్టుదాకా వినిపిస్తుంది.

"ఛీ ... సిగ్గులేని ముండ. తుపుక్కున వూశాడు. ఆ కటికోడు కనిపిస్తే చాలు,దీనికి ఒంటిమీద చీర నిలవదు. దీన్ని వదిలించుకోవాలి.

"భీక్యా.... ఒరే.... భీక్యా...." అలోచనల నుంచి తేరుకున్నాడు. లచ్చి కూడా లేచింది.

"ఏంరా.... మల్లిగట్ల సూస్తవు."



"గిటు వస్తివేందావి. గిది కలా నిజమావి."

"గిది నిజమేలేగాని.మీ అయ్య సచ్చిండు. నిన్ను తోల్కరమ్మని భిద్యా పంపిండు."

తండ్రి చచ్చిపోయాడు. తనను వాజమ్మను చేసిన తండ్రి చచ్చిపోయాడు. అనేకసార్లు తండ్రి చచ్చిపోవాలని గట్టు ముత్యాలమ్మకి మొక్కుకున్నాడు. తనే శుభవార్త వాడికి . తనకు ఆస్తి వస్తుంది. వెర్రిగా.... ఆశగా చూశాడు.

"ధూ .. ముసిలోడు సచ్చిండన్నమాట. ఓరి నక్రూ.... అయ్య సావబట్టేగా వాడు నాకు కబురంపింది. ముసిలోడు సావకుంటె నా జాడ జవాబు వాడికెందుకు. భీక్యా బతికుండని. గీ తండాలో వుండని వాడికెట్టా తెలుసురా."

"గా సంగతులు గిప్పుడెందుకుగాని. తండ్రికి తలగొరవి బెట్టె "హక్" నీదే గదరా.. గందుకే నిన్ను జరపచుజాయించి తోలుకరమ్మ డు.కన్నతండ్రి మళ్ళా యాద కన్పడుతడురా".

అంబలి వేళ కొస్తానని వ్రకుని పంపించాడు. ముసిలాడు చావటం వాడికి మంచి మేలే జరిగింది. యిక ఆస్తి పంచుకోవచ్చు. తనకు నాలుగు జీవాలు వస్తయి. యకరం పొలం వస్తది. ఇక సారాకాయడం జైలుకు పోవడం. పోలీసులు, తిట్లు తన్నులు తప్పుతాయి. లచ్చి భయభక్తులతో వుంటది. వాడికి విమాన మెక్కినంత సంతోషంగా వుంది.

తెల్లవారు ఝామున బండికి పోతే తప్ప- నడిచిపోవాలి. బస్సులున్నాయిగాని నాలుగు మైళ్ళు నడిచి వెళ్ళితే గాని దొరకవు. ఒక్కొక్కరోజు లింగాలలో అసలు బస్సే ఆగదు. ఏదేమైనా సారాయి కాయాలి. అమ్మాలి. నాలుగు డబ్బులు జేబులో వుంచుకునే వెళ్ళాలి. చిన్నోడి ముందు దర్జాగా వుండాలి. తెల్లమొఖం వేయకూడదు. ఇక సారాకాసే బుడుగులోనుంచి బయటపడేటప్పుడు వాడికెందుకు జంకాలి?

తండ్రి చనిపోయిన దుఃఖపు ఛాయలు కూడా వాడిలో లేవు. లచ్చివైపు తిరిగేడు. నాలుగు జీవాలు. యకరం పొలం ఆసామి అంటే లచ్చి కుక్కలాగా పడి వుంటది.కటికోడు మందలించినా యిదిలిస్తది.

భీక్యా జీవితానికి రెండే రెండు వ్యాసంగాలు. అతని జీవితమనే నాణంలో బొమ్మ సారాయి: బొరుసు జైలు. లాకప్పు.

చట్టానికి అందకుండా నేరాలు చేయడం సర్వసాధారణమైన రోజులివి. పలుకుబడి, డబ్బున్నవాళ్ళు బయటనే వుంటున్నారు. అవి లేని వారు జైలు, లాఠీలు.తన్నులు చవి చూస్తున్నారు.

భీక్యాకు జైలు పెద్ద స్థలమేమీ కాదు. తిండి దొరుకుతుంది. జైలరును మచ్చిక చేసుకుంటే యిక లేనిదేముంది.'ఆడసుఖం' తప్ప అన్నీ వుంటాయి—జైలులోనని వాడు అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు. వాడి జీవితానికి అక్షరాభ్యాసం జైలులోనే జరిగింది.

వాడికి గతం గుర్తుకొచ్చింది. తన జీవితం యిలా కావటానికి ముసిలాడే కారణం. వాడి తంకా చేరడానికి.చెడిపోయిన దానితో బతకడానికి కూడా ముసిలాడే కారణం. తమ్ముడన్నా. తండ్రి మాటన్నా వాడికి వంటిపై తేళ్ళు. జెర్రు పాకుతాయి.

వాడుకూడా తమ్ముడు భిద్యా లాగానే అర్థాకలితో పెరిగేడు.బడికి కూడా వెళ్ళాడు. బడిలో పెట్టే మొక్కజొన్న గటక. పాల కోసం రోజు హాజరయ్యాడు. గూనివాడవటంవల్ల తోటి పిల్లల్లోనూ. టీచర్లలోనూ చులకనగా చూడబడ్డాడు. మిగిలిన పిల్లలకు ఆటవస్తువయ్యాడు. టీచర్ల చేత చులకనగా చూడబడ్డాడు. అందుకే బడి మానేశాడు. తండ్రితోపాటు వాడూ సారాయి కాశాడు. సారాయిని దొంగచాటుగా సింగరేణికి చేరవేసేవాడు. వాడు సారా వ్యాపారం మొదలు పెట్టిన తరువాతనే నాలుగు జీవాలు (గొర్రెలు) కొన్నాడు. రెండు పూటలా తిన్నాడు. తమ్ముడిని ఖమ్మం పంపి చదివించాడు.

భిద్యాకు పోలీసు వుద్యోగం వచ్చింది. తండాలోనే వాడు తొలి సర్కారు మనిషి. ఎర్రటోపీని చూచి వణికిపోయే తండాలో ఒకడు "పోలీసైండంటే" మాటలా? భిద్యా పోలీసు వేషంచూచి తను పండుగ చేసుకున్నంత సంబరపడిపోయేడు. తండ్రి ఆనందం పట్టలేక "భట్టీ" కుండల్ని పగలగొట్టేడు. సారా కాయనని గట్టు ముత్యాలమ్మమీద ఒట్టు పెట్టుకున్నాడు.

"పోలీసోడి అయ్య సారాకాసి పట్టుబడితే నామోషి." అసలు చిన్నోడి వుద్యోగం పోద్దని వాడి భయం. ఆ రోజు కోడిని కోసి పండుగ చేశాడు

చిన్నోడికి పిల్లనిస్తామని తెగ సంబంధాలు వచ్చాయి. పెద్దోడికి పెళ్ళి కాకుండా చిన్నోడికి పెండ్లి చేస్తే కులతప్పు కట్టాలి. గూనోడికి పిల్లనెవరిస్తారు. మరి చిన్నోడికి కట్నం యిస్తామని వస్తున్నారు. "భోగం" (కన్యాశుల్కం) యిచ్చినా పెద్దోడికి పిల్ల దొరికేలాలేదు. అందరి చూపులూ చిన్నోడి మీదనే. ముసలాడిలో అసహనం రోజు రోజు పెరిగిపోయింది.

భీక్యాని చూస్తే తిట్టడం ముసలాడి పనిగా మారింది. భీక్యా ముసిలాడికి ఎదురు పడటం మానేశాడు. ఇంట్లో వుండడం కూడా వాడికి దుర్భరంగా వుంది. చేయడానికి పనిలేదు. చేతిలో చిల్లి గవ్వ లేదు. చివాట్లకు మాత్రం కొదవలేదు. కాలే పెనం మీద నీటిబొట్టులా వుంది వాడి పరిస్థితి. ఒక రోజు 'జీవాలు' కాయడానికి వెళ్ళాడు. దురదృష్టం వెంటాడింది. ఆ రోజే తోడేలు ఒక గొర్రెను చంపింది.

అంతటితో ఆ యింటికి వాడికి రుణంతీరిపోయింది. అన్నారం వదిలి దేశం మీద పడ్డాడు.గూనివల్ల ఎక్కడా పని దొరకలేదు. లంబాడోడికి పనెవరిస్తారు? వాడు చేయగల పని మాత్రమేముంది? అనేక రోజులు వస్తున్నాడు. చివరకు బిచ్చగాడయ్యాడు. దొరికిన దానిలోనే మిగిల్చి సారా కాయడానికి నిశ్చయించుకున్నాడు. అనువైన స్థలం కోసం గాలించి చివరకు కప్తాను బంజరు చేరాడు.



కులవృత్తిలా అబ్బిన ఈ పని తప్ప మరే పనిచేయలేనివాడు.

భట్టీ గొట్టంలోనుంచి జాడిలోకి సారాయి చుక్కలు చుక్కలుగా పడుతుంది. భీక్యా కనుపల్లోని అశ్రువుల్లా- సారాయిలోని వెచ్చదనంలాగా వాడి కన్నీటిలో ప్రతీకారం. ద్వేషం నిండివున్నాయి. లచ్చి దగ్గరగా వచ్చి పవిటతో కండ్లు తుడిచింది.

"ఏడిస్తే....సచ్చినోడు బతుకుతడా....? ముసల్తానాన అందరూ సచ్చేదే....సావకుండ బతికేదెవరు? వాండ్లతోనె పోవాల్సింది."

"తెల్లారినంక పోత."

"నా తాన అయిదు రూపాయలున్నాయి. సాలవా?"

"ఛీ నీయమ్మ ...ఐదేమైతయ్యే:"

"సేటు అప్పు పెడ్తడు గాని అడ్డికి సేరంటడు"

"మరేం సెయ్యమంటవు?"

"కారేపల్లిల అమ్ముకపోరాదు".

భీక్యాకు సలహా నచ్చింది. లచ్చి కూడా వస్తానన్నది. కాని కులం ఆడదానిని వెంటబెట్టుక వెళ్ళటం వాడికిష్టం లేదు. "ఎవరంటే ...? ఏం చెప్పాలి" లచ్చిని వద్దన్నాడు.

పొద్దుటే సొరకాయ బుర్రలో సారాయి నింపుకొని బయల్దేరాడు. కారేపల్లి పొలిమేరల్లోనే "హెడ్డు" కంటపడ్డాడు. "బుర్రకాయలో ఏమిట్రా?"


బిక్కు బిక్కుమంటూ చెప్పాడు "అంబలి. దొరా!"



## పిడుగుల్ని పరిచయం చైబోతున్నా!

ఎన్నాళ్ళిలా నిశబ్దాన్ని ప్రసారం చేయడం?
ఎప్పట్లానే మౌనాన్ని ఎలా అనువదించడం?
నేనిప్పుడు—
ప్రజకి జ్వాలల్ని, పిడుగుల్ని పరిచయం
చైబోతున్నా!
ప్రజకి సంక్షుభితని, సముద్ర ఘోషని భాషగా
నేర్పుతున్నా!!

నేనిప్పుడు—
నాలోనే నేను ప్రవహిస్తూ
ఎదుటి ఘజంలోకి
పిడికిళ్ళెత్తిన నినాదాల్లోకి
స్తబ్దిత సర్పం కాటేయగా మూర్ఛిల్లిన
జన సముద్రంలోకి ప్రవహిస్తున్నా!



కెరటాల్ని కత్తులుగా ఎత్తుకొస్తున్న
జన సమూహంలోంచి ప్రవిస్తున్నవాణ్ణి!
సమస్యలే
నేపథ్య సంగీతమైతే
నేనిప్పుడు ఉధృత వాతావరణాన్ని
గానం చేస్తున్న వాణ్ణి
చీకట్లోకి చొచ్చుకుపోతున్న
చూపుల్ని—
వణుకుతున్న ఆలోచనల్ని
తిరస్కరిస్తూ
అంటుకుంటున్న అడవుల్ని
ఆవిష్కరిస్తున్నవాణ్ణి.

—పి. మోహన్ ప్రసాద్

"దొంగ బాడఖావు అంబలారా....!" హెడ్డు బుర్రకాయ లాక్కున్నాడు. భీక్యా పంచ ప్రాణాలతోపాటు — తన్నులు. తాపులు. తిట్లు చివరకు లాకప్‌లో పడ్డాడు.

ఇన్‌స్పెక్టర్ రాగానే మరో నాలుగు తన్నాడు "ఏరా.... గాడిద కొడక.... మునుపు మజిస్ట్రేట్ గారి కాళ్ళు పట్టుకుంటే పించను కూడా యిస్తున్నరు గదరా!"

"ఔ....దొరా" మరో నాలుగు తన్నులు.

గూనివాడని కనికరించి "తహసిల్దా–మజిస్ట్రేటు" జీవన భృతికి నెలకు పాతిక రూపాయలిస్తున్నారు సాంఘిక సంక్షేమ నిధుల నుంచి ప్రతినెలా పాతిక రూపాయలు పించను (పెన్షన్) మంజూరు చేస్తూ "సారా కాయడం మానెయ్యాలని" గట్టిగా చెప్పారు. భీక్యా కూడా సారాయి కాయనని ఒట్టు పెట్టుకున్నాడు. ఇప్పుడు వాడి ప్రాణానికి మరో రెండు ప్రాణాలు చేరాయి. తండ్రి దగ్గర కెళ్ళలేదు. కాని కులం అకది తండాలో తప్పు కట్టమంటారు. ధరలు విపరీతంగా పెరిగాయి. లచ్చికూలి తన పించను కలిపినా గంజికే చాలటం లేదు. పొట్ట గడవని ఘడియల్లో భట్టిని ఆశ్రయించక తప్పలేదు. పేటు బలవంతం చెయ్యకుంటె మళ్ళీ ఈ పనిలో దిగేవాడు కాదు.

"కొట్టకు దొరా...." యస్సై కాళ్ళు పట్టుకున్నాడు. "మా అయ్య సచ్చిండు. ఈ ఒక్క దమ్మకి యిడిసిపెట్టు .... దొరా మల్ల జల్మల గీ పనిచేస్తె సంపు"

"ఎన్నిసార్లు సస్తడురా మీ అయ్య" మరో తాపు.

"సత్తె పెమాణంగా చెప్తున్న....దొరా"

"నీ తల్లి....తప్పుడు నా కొడక....అబద్ధాలకు కూడా ప్రమాణాలు" మరో రెండు లాఠీ దెబ్బలు.

"దొరా .... మడిపి జల్మంతా తప్పులు చెయ్యడు"

"చవట లంజ కొడక....నాకే నీతులు చెప్తవ్‌రా....నీ గూని తల్లి...." వీపు చిట్లిపోయింది. ఎదురు మాట్లాడితే దెబ్బలు తప్పవు సరిగదా యింకా కొడ్తారు. తెలిసి తప్పులు చెయ్యడం వాడి అలవాటు. ఏడ్చే వోపికకూడా లేదు. యస్సై బూటుకాలి తన్నుతో వాడికి తేలిపోతున్నట్టనిపించింది. పగలే చుక్కలు కనిపించాయి. "గూని" అనే మాట హోరులో స్పృహ తప్పింది.


"నక్క బిగువు పట్టాడేమో చూడండి" యస్సై గాండ్రించాడు. "పోర్ పార్టీశ్రీ వాడి ముఖాన నీళ్ళుకొట్టు" నీళ్ళు చల్లినా అదిలించినా. కదిలించినా లాభం కనిపించ లేదు.

"చచ్చాడేమో సార్." హెడ్డు భయం.

యన్నై కోపం భయంగానూ, అహం దడగానూ మారాయి. ముక్కుదగ్గర వేలు పెట్టేడు. శ్వాస వుంది. "వాడిని రైటరు గదిలో పెట్టి ఫ్యాన్ వేయండి." దిక్కుతోచని స్థితిలో మెయ్యబోయి మెడకు తగిలించుకున్నట్టుగా వుంది. వాడికేమన్నా అయితే... వీడిని వదిలించుకోవాలని హెడ్డు సలహా.

భీక్యా కొంచెం తెప్పరిల్లాడు. పొద్దు ఏటవాలుతుంది. నెమ్మదిగా వత్తిగిల్లాడు. ప్రక్కన పొద తగిలింది. లేచి కూర్చున్నాడు. కడుపులో దేవినట్లయింది. తలదిమ్ము. తూలి పడబోయి నిలదొక్కుకున్నాడు. సొరకాయ బుర్ర కాలికి తగిలింది. దానిలో సారా సగం వుంది. పోలీసు స్టేషను జాడ లేదు. చుట్టూ దొంత పొదలు. ఏమీ అంతుబట్టలేదు. అంతా అయోమయంగా వుంది. గిచ్చి చూచుకున్నాడు. బతికే వున్నాడు. నేలను తాకి చూశాడు. చుట్టూ పరికించాడు "మసికట్ట.... అవును అది మసికట్టే" అంత నీరసంలోనూ నవ్వుకున్నాడు "పిరికి నంజ కొడుకులు."

వాడికెటు పోవాలో తోచలేదు. ఇప్పుడు అన్నారం పోయి చేసేది లేదు. అయ్య



చచ్చినా రానోడికి ఆస్తిలో భాగం లేదంటాడు. అసలే పోలీసోడు. తండ్రికి తలకొరవి పెట్టింది తన తప్పు కాదు. పించను చాలదు. సారాయే వాడికి బతుకుదెరువు. ఈసారి దొరడిగితే చెప్పాల. "పొట్ట గడవక గీ పని చేస్తున్నగాని బంగ్లా కడ్తానికి కాదుగా." పేదరికం బుడుగులాంటిది. ఈ బుడుగులో నుంచి ఎంత బయటపడదామని ప్రయత్నిస్తే అంత కూరుకపోవడం జరుగుతుంది. ఈ బుడుగులో నుంచి బయటపడాలన్న అతని ఆశాసౌధం కూలిపోయింది. ●

గమనిక :— తెలంగాణాలోని గిరిజన ప్రాంతంలో "[illegible]"ని "బుడుగు" అంటారు.

7 వ తరగతి, 10 వ తరగతి, మెట్రిక్, ఇంటర్ (తెలుగు మరియు ఇంగ్లీషు మీడియం) విద్యార్థులకు అపూర్వ అవకాశం. పరీక్షలకు తయారు కాలేదని నిరుత్సాహపడవద్దు. 20 సంవత్సరాల అనుభవముకల ఉపాధ్యాయులచే సబ్జక్టుకు రెండు ఇంపార్టెంట్ పేపర్లు సెలక్ట్ చేయబడినవి. గత పరీక్షలలో 80 నుండి 100 వరకు సెలక్టు ప్రశ్నలు వచ్చినవి. క్లాసు, మీడియం, గ్రూపు వ్రాస్తూ రు. 11-50 ఎం. ఒ. చేసిన ఇంపార్టెంట్ సెట్టు పంపగలము.

**B. S. CHANDRA PUBLICATIONS,**
**27-23-59/4, GOPALAREDDy ROAD,**
**VIJAYAWADA-2**

SUVARNA

ఎదురు చూడని క్లైమాక్స్‌తో
ఫిబ్రవరి 10న విడుదలైంది!




ఆంధ్రుల ఆరాధ్య
యువ రచయిత
మల్లాది వెంకటకృష్ణమూర్తి
చంటబ్బాయ్
(ఆంధ్రజ్యోతి వారపత్రికలో సీరియల్‌గా వస్తోంది.)
రూ. 20/-

పుస్తకం ధరలో రూ. 1-00 తగ్గించి M.O. చేసిన వారికి ఆరూపాయికే VPP లో పంపుతాం.
అడ్వాన్సు పంపని ఖాతాదారుల ఆర్డర్లు అంగీకరించబడవు.

Bachi

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్
మ్యూజియంరోడ్, విజయవాడ-2
PHONE: 63322